క్లుప్తంగా

చెరువును తలపిస్తున్న రోడ్డు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం వీధిలో రోడ్డు చెరువును తలపిస్తుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు ఎక్కువై రోడ్డుపైనే నీరు నిలిచిపోయింది. దీంతో రోడ్డుపై నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు డ్రెయినేజీ సౌకర్యం లేక పోవంటతో వర్షపు నీరు రోడ్డు పైనే నిలుస్తుంది. గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షానికి కూలిన పూరిల్లు

వెంకటాపురం(కె): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని రామచంద్రాపురంలో పూరిల్లు కూలిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం గ్రామానికి చెందిన కారం కాంతరావు అనే వ్యక్తి ఇల్లు వర్షానికి నేలమట్టమైయింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

వ్యక్తిపై కోతి దాడి

మంగపేట: వ్యక్తిపై కోతి దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆదివారం మండలంలోని కమలాపురంలో చోటుచేసుకుంది. సుభాస్ కాలనీకి చెందిన గోకారపు వరప్రసాద్ తన ఇంట్లో పనిచేస్తున్న క్రమంలో ఇంట్లోకి చొరబడేందుకు వచ్చిన కోతుని అడ్డుకోబోవడంతో అతడిపై తీవ్రంగా దాడిచేసి గాయపరిచింది. కోతి దాడితో బాధితుడి ముఖం కనుబొమ్మలు, నుదుటిపై గాయాలయ్యాయి. గ్రామంలో గత కొంత కాలంగా వందలాది కోతుల మూక గ్రామంలో తిష్ట వేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సంబంధిత అధికారులు స్పందించి కోతులబెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు వాపోయాడు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

గోవిందరావుపేట: ప్రమాదవశాత్తు పంట కాలువలో జారిపడి మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధూపాటి మల్లయ్య (60) గ్రామ శివారులో ఉన్న పంట కాలువలో కాలు జారి పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు బయటకు తీయడంతో అప్పటికే మృతి చెందాడు.

రైతులకు రుణమాఫీతో ఆర్థిక భరోసా

కాటారం: రైతులకు రుణమాఫీ ఆర్థిక భరోసాను కల్పిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ శ్రేణులు మండలంలోని దేవరాంపల్లిలో ఆదివారం రైతులతో కలిసి సంబురాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

'చేపల వేటకు వెళ్లొద్దు'

టేకుమట్ల: భారీ వర్షాల కారణంగా చెరువుల్లో, మానేరు చలివాగుల్లో వరద ఉధృతి పెరుగుతుంది కావున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఎస్సై గోగికారి ప్రసాద్, ఎంపీఓ గాడ సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని ముంపు ప్రాంతాలు, మానేరు, చలివాగు, చెరువుల మత్తళ్ల ప్రాంతాలలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వెలిశాల చెరువు మత్తడిలో మత్స్యకారులు చేపలు పడుతుండగా అక్కడికి చేరుకుని వరద ఉధృతికి ప్రమాదాల బారిన పడుతారని అక్కడి నుంచి వారిని పంపించారు. అలాగే మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో పేరవేన రవి ఇంటిని పరిశీలించి, వర్షాలకు ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉంది కావున ప్రత్యమ్నయ పునరావాసానికి చేరుకోవాలని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేని భారీ వర్షాల వల్ల వాగులు, చెరువులు నిండుకుని ప్రవహిస్తుయని ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పెరిగిన వరద ఉధృతి

- ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు



ములుగు రూరల్: బొగ్గువాగు ఉధృత్తిని పరిశీలిస్తున్న సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు

గోవిందరావుపేట: కురుస్తున్న వర్షాలకు మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో గుండ్లవాగు ప్రాజెక్ట్ నిండిపోయింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. గుండ్లవాగు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 25 ఫీట్లు కాగా, ఆదివారం సాయంత్రం వరకే పూర్తిస్థాయి 25 ఫీట్లు నిండి, అలుగు పోస్తుంది. నీటి మట్టం పెరుగుతుండడంతో గుండ్లవాగు ఉధృతిని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పస్రా ఎస్సై కమలాకర్ ముంపు ప్రాంతాల వారిని లక్ష్మీపురం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంలోకి వెళ్లాలని సూచించారు. అలాగే మండలంలోని లక్నవరం సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 34 ఫీట్లు కాగా 23 ఫీట్ల నీరు వచ్చి చేరిందని, ఇంక సరస్సులోకి ఎగువ నుండి భారీ వరద నీరు వచ్చి చేరుతుందని, సోమవారం ఉదయం వరకు మరో మూడు నాలుగు ఫీట్లు పెరగవచ్చు అని అధికారులు తెలిపారు.

మండలంలో పెరుగుతున్న గోదావరి

వెంకటాపురం(కె): మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. అలాగే మండలంలో గోదావరి వరద పెరుతుంది. కాగా మంగపేట రోడ్డులోని గోదావరి పాయకు గోదావరి వరద చేరటంతో గోదావరి లంకల్లోకి రాక పోకలు నిలిచిపోయాయి. మండలంలోని కంకలవాగు, పాత్రాపురం, వాగు, జిన్నెలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు గిరిజన గ్రామలకు రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ములుగు రూరల్: భారీ వర్షాల కారణంగా మండలంలోని బొగ్గులవాగు, రాళ్లవాగు, మేడివాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శంకర్ సూచించారు. ఆదివారం మండలంలోని సర్వాపూర్-జగ్గన్నగూడెం గ్రామల మధ్య ఉన్న బొగ్గుల వాగు ఉధృతిని ఆయన పరిశీలించి మాట్లాడారు. భారీ వార్షల కారణంగా వాగులు , వంకలు పొంగి పొర్లుతున్నాయని పశువుల కాపరులు వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని సూచించారు. మండలంలోని బండారుపల్లి శివారులో గల రాళ్లవాగు ప్రవాహానికి రోడ్డు కోట్టుకుపోయిందని అన్నారు. భూపాలపల్లి, గణపురం గ్రామాలకు వెళ్లె ప్రజలు అబ్బాపూర్ మీదుగా వెళ్లాలని అన్నారు. ములుగు నుంచి పాట్లాపూర్ వెళ్లె దారిలో అన్నంపల్లి సమీపంలో ఉన్న మేడివాగు ప్రవాహం ఎక్కువగా ఉందని వాహనదారులు గమనించాలని అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రమాద స్థలాలలో బోర్డులను ఏర్పాటు చేశామని అన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని వరద ప్రభావంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలకు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరిస్తు స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి ఆయా ప్రాంతాల్లో ఆదివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంట వెళ్లే కూడలి ఒర్రె కాజ్‌వే, కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని బొమ్మాయిగూడేనికి వెళ్లే రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న బొమ్మాయిగూడెం(గౌరారం)వాగు వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సూరి మాట్లాడుతూ.. మూడు రోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద తీవ్రంగా పెరిందన్నారు. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎవరకూడా సరదాగా ఈతకు, చేపలవేటకు ఎవరుకూడా వెళ్లొద్దన్నారు. రోడ్లపై నుంచి పారే వదలను దాటవద్దని సూచించారు. వరదలు, వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఏదైనా సహాకారం కావాలంటే పోలీస్ స్టేషన్ నంబర్ 8712670092కు ఫోన్‌చేయాలని సూచించారు.

మండలంలోని అటవీ మారుమూల రెండు గిరిజన గ్రామాలకు ఆదివారం ఉదయం నుంచి రవాణాసౌకర్యం పూర్తిగా నిలిచి పోయాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు శనివారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై టీవీఆర్ సూరీ ఆయా గ్రామపంచాయతీల సిబ్బందిని అప్రమత్తం చేసి వరద ఉధృతి తగ్గే వరకు ఎవరుకూడా వరద నీటి నుంచి దాటవద్దని హెచ్చరిస్తు ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

వరదలోకి ఎవరూ వెళ్లొద్దు

వాజేడు: గోదావరి వరద పెరుగుతుండటం, వాగులు, వంకలు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో వరద నీటిలోకి ప్రజలు ఎవరూ వెళ్లవద్దని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని వరద ఉధృతి ఎక్కుగా ఉన్న చోట పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వదరల సమయంలో వాగులను దాటాలని ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చు కోవద్దని కోరారు. జాతీయ రహదారిపై గోదావరి వరద చేరిందని రెండు రాష్ట్రాల ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాక పోకలు నిలిపివేశామని ప్రజలు గమనించాలన్నారు.

నిలిచిపోయిన రాకపోకలు

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరి పెరుగుతుంది. మండలంలో రహదారులు పలు చోట్ల ముంపునకు గురి కావడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడికుంట వాగు ద్వారా రహదారిపైకి వరద నీరు చేరడంతో కృష్ణాపురం, కడేకల్, పెద్దగంగారం, చంద్రుపట్ల, టేకులగూడెం గ్రామాలకు పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల ప్రజలు పేరూరుకు రావాలంటే జాతీయ రహదారిపై నుంచి చుట్టూ తిరిగిరావాల్సి ఉంటుంది. అదే విధంగా మండల కేంద్రం సమీపంలో కొంగాల వాగు ద్వారా వచ్చిన గోదావరి రహదారిని ముంచింది. దీంతో వాజేడు, గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు ఆగాయి. కొంగాల వాగు అవతల ఉన్న సుమారు 25 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే జగన్నాథపురం మీదు నుంచి రావాల్సి ఉంది. పరిధిలోని పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్యన ఉన్న వంతెన పైకి వరద నీరు చేరడంతో పలు గ్రామాల ప్రజలు వెంకటాపురం(కె) మీదుగా వాజేడుకు రావాల్సి ఉంటుంది.

ముంపునకు గురైన జాతీయ రహదారి

మండల పరిధిలోని టేకులగూడెం గ్రామ సమీపంలో 163 నంబర్ జాతీయ రహదారిపైకి గోదావరి వరద ఆదివారం చేరింది. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ వరదలోకి ఎవరు ఎళ్లకుండా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.



వెంకటాపురం(కె): ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి పాయ



గోవిందరావుపేట: నిండుకుండలా గుండ్లవాగు ప్రాజెక్టు



ములుగు రూరల్: ప్రమాద స్థలాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



వాజేడు : పుసురు ఎడ్జర్లపల్లి మధ్య వరద ఉధృతి



వాజేడు: రోడ్డుపైకి చేరిన వరద

నిలిచిన రాకపోకలు



తాడు సాయంతో కలిపాక వాగును దాటుతున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లటంతో పాటు ఉధృతంగా ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. కలిపాక గ్రామ సమీపంలోని కలిపాక వాగు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు వాగుపై తాడును ఏర్పాటు చేసుకొని తాడు సాయంతో వాగును దాటి ఆలుబాక గ్రామానికి చేరుకుంటున్నారు.

రోడ్ల మూసివేత



ఏఎస్పీ శివం ఉపాధ్యాయకు వరదలపై వివరిస్తున్న ఎస్సై తాజొద్దిన్

ఏటూరునాగారం: భారీ వర్షపాతం ప్రస్తుత వాతావరణం దృష్ట్యా పలు చోట్ల రోడ్డు రోడ్లు మూసివేసినట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రొయ్యూర్, అల్లవారి ఘనపురం మారెడుకుంట, నాగులమ్మ ఒర్రెల వద్ద నీరు ప్రవహిస్తోందన్నారు. ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలో దిగువ స్థాయి వంతెనలపై నీటి కారణంగా రోడ్డు కోతకు గురవుతుందని, జంపన్న వాగు కారణంగా కొండాయి, మల్యాల, చెల్పాక, ఎలిశెట్టిపల్లి రోడ్డు మూసివేసినట్లు తెలిపారు. కన్నాయిగూడెం మండలంలో ఐలాపూర్ రోడ్డు బ్లాక్ చేశామన్నారు. అలాగే వెంకటాపురం(కె), వాజేడులో పలు ప్రాంతాల్లో రోడ్లను మూసివేసినట్లు తెలిపారు. ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగల రాళ్లవాగు బ్రిడ్జి తెగిపోయినందున ఘనపూర్ వెళ్లేవారు అబ్బాపూర్ లేదా వెంకటాపురం మీదుగా వెళ్లవలసి ఉంటుందన్నారు. బొగ్గులవాగు మీదుగా జగ్గన్నగూడెం వెళ్లేవారు సర్వాపూర్ నుంచి హై లెవెల్ బ్రిడ్జి గుండా అంకన్నగూడెం ద్వారా జగ్గన్నగూడెం వెళ్లాలని సూచించారు. దేవగిరిపట్నం నుంచి అన్నంపల్లి మధ్యలో రోడ్ మీద కూడా లో లెవెల్ కాజువే పైన వాటర్ ప్రవాహం ఉన్నందున కాజువే ను ఎవరు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. వెంకటాపురం (ఎం) పరిధిలో మోరంచవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున గుర్రంపేట రోడ్డు తెగిపోయిందన్నారు. వెలుతుర్లపల్లి నుంచి అప్పయ్య పల్లి సీతారాంపురం కొండాపూర్ వెళ్లే గ్రామ ప్రజలు వెల్తుర్లపల్లి జంక్షన్ గుండా వయా గణపూర్ వెళ్లాలని తెలిపారు. బూర్గుపేట వెళ్లే వారు పాలంపేట మీదుగా ఘనపూర్ వెళ్లాలని అన్నారు. లింగాపూర్ నుంచి 163 గుండా జవహర్‌నగర్ వెళ్లే దారిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున లింగాపూర్ నుంచి వెంకటాపురం లేదా జంగాలపల్లి గుండా 163 వ రహదారికి చేరుకోవాలన్నారు.



మంగపేట: బొమ్మాయిగూడెం వాగువద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు



వాజేడు: పేరూరు మర్రిమాగు వాగు వద్ద ఎస్సై కృష్ణ ప్రసాద్



గోవిందరావుపేట: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి



జాకారం- గట్టమ్మ ఆలయాల మధ్య ఉన్న పానేస వాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

- మంత్రి సీతక్క

ములుగు రూరల్: అధిక వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని జాకారం-గట్టమ్మ ఆలయాల మధ్య ఉన్న పానేస వాగు ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ జాతీయ రహదారి పనుల్లో భాగంగా గట్టమ్మ ఆలయ సమీపంలో చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు అవసరమైతే తప్పా బయటకి రాకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

మహాముత్తారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కొత్తగా వచ్చిన పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రైతు బీమా చేసుకున్న రైతులు మార్పులు చేసుకునే వెసలుబాటు ఉందన్నారు. అదే విధంగా గతంలో పాసు పుస్తకాలు వచ్చి ఇంకా బీమా చేసుకోని వారు కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు 5లోపు సంబంధిత ఏఈఓ దగ్గరకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



మంగపేట: గురు పౌర్ణమి వేడుకలో పాల్గొన్న భక్తులు



వెంకటాపురం(కె): అన్నదాన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు

మంగపేట: మండలంలోని కమలాపురం శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆలయక మిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం గురుపౌర్ణమి భక్తిగీతాల ఆలాపన తదితర నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు, ప్రముఖులు దంపతులతో వచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో మహిళలు, భక్తులు కోలాట భజనతో శ్రీ షిరిడీ సాయినాధుని ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో ఉన్న సాయిబాబా ఆలయం, పెట్రోల్ బంక్ సమీపంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబా భక్త మండలి సభ్యులు వేల్పూరి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జాగర శాంతమూర్తి, శివాజీ, శ్రీనివాస్, సంతోష్ ఉన్నారు.



ములుగు: సుదర్శన హోమం చేస్తున్న భక్తులు

ములుగు: జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్ సాయిబాబా ఆలయంలో గురు పూర్ణిమ వేడుకలు ఆదివారం ఆలయ వ్యవస్థాపకుడు ఆకుల రజిని-ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సాయినాధుడిని దర్శించుకొని సుదర్శన హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుల ప్రవీణ్ మాట్లాడుతూ.. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించిన తల్లిదండ్రులను, గురువులను మనసులో స్మరించుకోవాలని అన్నారు. వారిని గౌరవిస్తూ చూపించిన సన్మార్గంలో నడవాలని అన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



జంపన్న వాగు ఉధృతిని పరిశీలిస్తున్న సీఐ రవీందర్

ఉరకలేస్తున్న జంపన్నవాగు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జంపన్నవాగు వరదతో ఉరకలేస్తుంది. మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకండా కురుస్తున్న వర్షాలతో జంపన్నవాగులోకి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. జంపన్నావాగు బ్యాటరీ స్టాప్ బిగించే ప్లాట్ ఫాం వరకు వరద ఉధృతి పెరిగింది. గత ఏడాది వరదలను దృష్టిలో పెట్టుకుని మేడారం జంపన్నవాగు పరిసరాల ప్రాంతంలోని వ్యాపారులు అప్రమత్తమయ్యారు. ఆది వారం మేడారంలోని జంపన్నవాగు వరద పరిస్థితులను పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డిలు పరిశీలించారు. మేడారం జంపన్నవాగు లోతట్టు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేడారం జంపన్నవాగు పరిసరాల ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులను కూడా దుకాణాలు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. కాగా మూడు రోజుల నుంచి వర్షాలు కురియడంతో ఎల్బాక లోవలేవల్ కాజ్‌వై నుంచి వరద భారీగా ప్రవహించడంతోపాటు, ఊరట్టం తుముల వాగు వరద రోడ్యాంపై నుంచి ప్రవాహించడంతో ఎల్బాక, పడిగపూర్, ఊరట్టం గ్రామాలకు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో గ్రామాల్లోని ప్రజలు ముందస్తుగా జాగ్రతలు తీసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు అప్రమతం చేస్తున్నారు. వరదల వలన ప్రజలకు ముంపు వాటిల్లకుండా అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్న వాగు